సాక్షి మహబూబ్‌నగర్

సోమవారం | 29 | జనవరి | 2024



అన్ని శాఖల్లో అలర్ట్

ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ అధికారులు, సిబ్బంది పనితీరుపై ఏసీబీ దృష్టి సారించింది.

వివరాలు 8లో ▸



శిక్షణ ఎలా?

పాలమూరు ఇండోర్ స్టేడియంలో కోచ్‌లు లేక క్రీడాకారులు ఇబ్బందులు పడుతున్నారు.

వివరాలు 10లో ▸



వాతావరణం

మళ్లీ చలి తీవ్రత పెరిగింది. తెల్లవారుజామున, రాత్రి చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

గ్రంథాలయాలను బలోపేతం చేయాలి



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: గ్రంథాలయాలను బలోపేతం కోసం కృషి చేయాల్సిన అవసరం ఉందని రాజా రామ్మోహన్‌రాయ్ లైబ్రరీ ఫౌండేషన్ డైరెక్టర్ బీవీ శర్మ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని రాంనగర్ గ్రంథాలయాన్ని ఆయన సందర్శించారు. నేషనల్ మిషన్ ఆన్ లైబ్రరీస్ స్కీం ద్వారా భవనాన్ని అన్ని వసతులతో నిర్మించినట్లు పేర్కొన్నారు. భవిష్యత్‌లో గ్రంథాలయానికి మరింత సహకారం అందిస్తామన్నారు. ఈ మేరకు పుస్తకాల రికార్డులను పరిశీలించారు. అనంతరం పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు అందుతున్న వసతులు, పుస్తకాలు తదితర విషయాలపై అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాల కార్యదర్శి మనోజ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇద్దరు టీపీసీసీ అధికార ప్రతినిధుల కేటాయింపు



జహీర్ అక్తర్



కల్వ సుజాతగుప్త

స్టేషన్ మహబూబ్‌నగర్: రానున్న లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మహబూబ్‌నగర్ పార్లమెంట్‌కు ఇద్దరు టీపీసీసీ అధికార ప్రతినిధులను కేటాయించారు. ఈ మేరకు టీపీసీసీ అధ్యక్షుల ఆమోదం మేరకు వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్‌గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. వీరు లోక్‌సభ ఎన్నికలు ముగిసేవరకు పార్లమెంట్ పరిధిలోని అసెంబ్లీలకు సంబంధించి వివిధ సమస్యలపై ఆ ప్రాంత నాయకులతో కలిసి ప్రతిరోజు సమావేశాలు నిర్వహించనున్నారు.

ఇసుక తరలించే వాహనాల తనిఖీలు

మహబూబ్‌నగర్ క్రైం: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇసుక అక్రమ రవాణా కట్టడిపై టీఎస్‌ఎండీసీ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఉమ్మడి జిల్లాలోని కొల్లాపూర్ చౌరస్తా, తెల్కపల్లి, నారాయణపేట, మక్తల్, మాగనూర్, పాలమూరు జిల్లాకేంద్రంలోని బైపాస్ రోడ్డు, కోయిలకొండ ఎక్స్‌రోడ్‌లో ఆదివారం తనిఖీలు చేశారు. అధిక లోడ్‌తో పాటు ఎలాంటి వేబిల్లు లేకుండా ఇసుక తరలిస్తున్న వాహనాలను తనిఖీలు చేసి, జరిమానాలు విధించారు. మొత్తం రెండు బృందాలలో ఆరుగురు అధికారులు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా అధికారి దశరథ్ మాట్లాడుతూ అధిక లోడ్‌తో వెళ్తున్న ఇసుక లారీలు, టిప్పర్‌లకు టన్ను లోడ్‌కు రూ.2వేల జరిమానా విధిస్తున్నట్లు తెలిపారు. దీంతో పాటు వేబిల్స్ లేకుండా ఇసుక రవాణా చేస్తే రూ.50వేలు జరిమానాలు విధించడంతో పాటు కేసు నమోదు చేస్తున్నట్లు వెల్లడించారు.

మైసమ్మ చెంత జనజాతర

నవాబుపేట: మండల పరిధిలోని పర్వతాపూర్ మైసమ్మ ఆలయం చెంత ఆదివారం జనజాతర కొనసాగింది. పొట్టేళ్లు, కోళ్లను బలిచ్చి పెద్దఎత్తున అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. మైసమ్మ అడవి మొత్తం వేలాది మంది భక్తులతో నిండిపోయింది. అమ్మవారి నామస్మరణ ఆలయ ప్రాంగణం మార్మోగింది.




● బీజేపీలో బీసీ కుంపటి

మూడు ముక్కలాట..!

లోక్‌సభ ఎన్నికల వేళ రసవత్తరంగా రాజ'కీ'యాలు

- మహబూబ్‌నగర్‌లో పెరుగుతున్న బీసీ గళం
- శాంతికుమార్‌కు మద్దతు వెల్లువ
- ఇక్కడి నుంచే టికెట్ ఆశిస్తున్న డీకే అరుణ, జితేందర్‌రెడ్డి
- నేతల మధ్య తారస్థాయికి చేరిన అంతర్గత పోరు
- హాట్‌టాపిక్‌గా చల్లా, డీకే పరస్పర సవాళ్లు
- బీసీ వాదాన్ని కనుమరుగు చేసేందుకేనని సంఘాల మండిపాటు



సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్:

లోక్‌సభ ఎన్నికల వేళ భారతీయ జనతా పార్టీలో రాజకీయాలు రసవత్తరంగా మారాయి. ప్రధానంగా మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలో చోటుచేసుకుంటున్న పరిణామాలు హాట్‌టాపిక్‌గా నిలుస్తున్నాయి. పార్టీలో బీసీ వాదం తెరపైకి రావడం.. బడుగు, బలహీన వర్గాలు ఏకమవుతుండడం పార్టీలో పెనుదుమారం రేపుతోంది. ఫలితంగా ఈ ఎంపీ నియోజకవర్గం నుంచి టికెట్ ఆశిస్తున్న నేతల మధ్య అంతర్గత పోరు తారస్థాయికి చేరింది. ఈ క్రమంలో మహబూబ్‌నగర్ పార్లమెంట్ నుంచి టికెట్ ఆశిస్తున్న కాంగ్రెస్‌కు చెందిన సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి, బీజేపీ జాతీయఉపాధ్యక్షురాలు డీకే అరుణ మధ్య పరస్పర సవాళ్లు రాజకీయాలను మరింతగా హీటెక్కిస్తున్నాయి. ఇదే సమయంలో రోజురోజుకూ పెరుగుతున్న బీసీ వాదం నుంచి అందరి దృష్టి మళ్లించేలా కుమ్మక్కు రాజకీయాలకు తెరలేపారనే విమర్శలు ఆయా సంఘాల నుంచి వెల్లువెత్తుతుండగా.. రాజకీయవర్గాలతో పాటు ప్రజల్లో చర్చ జోరుగా సాగుతోంది.

అప్పుడు 2.. ఇప్పుడు 3 వర్గాలు

ఉమ్మడి పాలమూరుకు సంబంధించి బీజేపీలో మాజీ మంత్రి, ఆ పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, మాజీ ఎంపీ, పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఏపీ జితేందర్‌రెడ్డి క్రియాశీలకంగా వ్యవహరిస్తున్న విషయం తెలిసిందే. మహబూబ్‌నగర్ పార్లమెంట్ నుంచి బీజేపీ తరఫున జితేందర్‌రెడ్డి గతంలో ఓసారి ఎంపీగా గెలుపొందారు. గత ఎన్నికల్లో ఈ స్థానం నుంచి డీకే అరుణ బరిలో నిలిచారు. ఓటమి పాలైనప్పటికీ ఈ లోక్‌సభ పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల్లో గణనీయమైన ఓట్లు సాధించి రెండోస్థానంలో నిలిచారు. పార్టీలో ఎప్పటి నుంచో ఈ రెండు వర్గాల మధ్య ఆధిపత్య పోరు కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసేందుకు వీరిరువురూ సిద్ధం కాగా.. రెండు పర్యాయాలు టికెట్ వచ్చినట్లే వచ్చి, పార్టీ అధిష్టానం సూచనలను గౌరవించి తప్పుకున్న బీసీ వర్గానికి చెందిన పార్టీ సీనియర్ నేత, రాష్ట్ర కోశాధికారి శాంతికుమార్ ఈసారి బరిలో నిలవడం ఖాయమని స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు. పార్టీ అధిష్టానం తనకే టికెట్ ఇస్తుందని ధీమా వ్యక్తం చేస్తున్న ఆయన ఆయా నియోజకవర్గాల్లో ఇప్పటికే చాపకింద నీరులా ప్రచారం ముమ్మరం చేయడంతోపాటు దూకుడు పెంచడం పార్టీలో చర్చనీయాంశంగా మారింది. బీజేపీలో క్షేత్రస్థాయిలో సంస్థాగత నిర్మాణం, జాతీయస్థాయి అంశాలతో ప్రభావితమయ్యే నియోజకవర్గం కావడంతో టికెట్ కోసం ముగ్గురు నేతలు ముమ్మరంగా ప్రయత్నిస్తుండగా.. మూడు వర్గాల మధ్య అంతర్గత పోరు తారస్థాయికి చేరినట్లు తెలుస్తోంది.

పోస్టర్ల చించివేతతో రాజుకున్న చిచ్చు..

మహబూబ్‌నగర్ ఎంపీ బరిలో నిలిచేందుకు శాంతికుమార్ పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు. ఈ క్రమంలో తొలుత కేంద్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించిన పోస్టర్లు ముద్రించి లోక్‌సభ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రదర్శిస్తూ పలుచోట్ల అంటించారు. ఆ తర్వాత పాలమూరు మోదీ పేరిట, అనంతరం శాంతికుమార్ పేరిట తయారు చేసిన పోస్టర్లను ఆయన అనుచరులు ఇంటింటికీ తిరుగుతూ అతికించారు. అయితే బీజేపీలోని ఓ వర్గానికి చెందినవాళ్లు ఆ పోస్టర్లను చించివేయడంతో చిచ్చు రాజుకున్నట్లు తెలుస్తోంది.

శాంతికుమార్‌కు బీసీ మహిళా నేతల మద్దతు..

జనాభా దామాషా ప్రకారం ఎన్నికల్లో బీసీలకు టికెట్లు కేటాయించాలని కోరుతూ బీసీ వర్గానికి చెందిన మహిళా సంఘాలు మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలోని జడ్చర్ల, దేవరకద్ర, షాద్‌నగర్, కొడంగల్‌లో బీసీల ఆత్మగౌరవం, రాజ్యాధికారం పేరిట సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ వర్గానికి చెందిన శాంతికుమార్‌కు బీజేపీ తరఫున మహబూబ్‌నగర్ ఎంపీ టికెట్ కేటాయించాలని కోరుతూ ఆయనకు మద్దతు ప్రకటించారు. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా బీజేపీ గెలిస్తే బీసీ అభ్యర్థే ముఖ్యమంత్రి అవుతారని పార్టీ పెద్దలు ప్రకటించారని గుర్తు చేశారు. కనీసం మహబూబ్‌నగర్ పార్లమెంట్ టికెట్‌ను క్రమశిక్షణ కలిగిన పార్టీ నాయకుడిగా పేరొందిన బీసీ సామాజిక వర్గానికి చెందిన శాంతికుమార్‌కు ఇవ్వాలని ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. సమావేశాల్లో సుశీల, భీమమ్మ, బాలమణి, అరుణమ్మ, కళావతి, సుజాత పాల్గొన్నారు.

బీసీలు ఇకనైనా మేల్కోవాలి..

2019 ఎన్నికల్లో బీజేపీ నుంచి డీకే అరుణ, కాంగ్రెస్ నుంచి చల్లా వంశీచందర్‌రెడ్డి పోటీ చేశారు. రూ.15 కోట్లు ఇస్తేనే కాంగ్రెస్ నుంచి ఎంపీగా పోటీ చేస్తానని డీకే అరుణ చెప్పినట్లు ఆనాడు ఆయన ఎందుకు చెప్పలేదు? ఇప్పుడు ఆ అంశాన్ని లేవనెత్తడం ఎవరిని మభ్య పెట్టేందుకో? తెరపైకి వచ్చిన బీసీ వాదాన్ని కప్పిపుచ్చేందుకే కుమ్మక్కు రాజకీయానికి పాల్పడుతున్నారు. బీసీలు ఇకనైనా మేల్కోవాలి. పార్టీలకతీతంగా అభ్యర్థులను గెలిపించుకోవాలి.

– శివకుమార్, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

పార్టీ జిల్లాల అధ్యక్షుల మార్పుతో..

ఓ వైపు పోస్టర్ల లొల్లి కొనసాగుతుండగానే బీజేపీ జిల్లాల అధ్యక్షులను మారుస్తూ ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఇటీవల ప్రకటించిన విషయం తెలిసిందే. బడుగు, బలహీన వర్గాల ఓట్లు అధికంగా ఉన్న మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలోని మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల్లో బీసీ సామాజిక వర్గానికి చెందిన అధ్యక్షులను తప్పించి.. వారి స్థానంలో ఉన్నత వర్గానికి చెందిన వ్యక్తులను నియమించారు. దీంతో ఆ పార్టీలోని బీసీ వర్గాలకు చెందిన నాయకులు, కార్యకర్తల్లో అసంతృప్తి రాజుకున్నట్లు తెలుస్తోంది. మహబూబ్‌నగర్ పార్లమెంట్ నుంచి పోటీ చేసేందుకు శాంతికుమార్ ప్రయత్నాలు ముమ్మరం చేసిన క్రమంలో అధ్యక్షులను మార్చడం వెనుక ఉమ్మడి జిల్లాకు చెందిన ఇద్దరు ముఖ్య నేతల ప్రమేయం ఉన్నట్లు బీసీ సామాజిక వర్గానికి చెందిన నేతలు ఆరోపించడం పార్టీలో కలకలం సృష్టిస్తోంది.

సమాజ నిర్మాణంలో మహిళలదే ముఖ్యపాత్ర

- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పట్లోళ్ల మాధవిదేవి
- పాలమూరులో మహిళాశక్తి సమ్మేళనం



సమ్మేళనంలో ప్రసంగిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి పట్లోళ్ల మాధవిదేవి

స్టేషన్ మహబూబ్‌నగర్: భారతీయ మహిళలు అన్ని రంగాల్లో సమర్థులై కుటుంబంతో పాటు సమాజ నిర్మాణంలో ముఖ్యపాత్ర పోషిస్తున్నారని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పట్లోళ్ల మాధవిదేవి అన్నారు. జిల్లాకేంద్రంలోని అన్నపూర్ణ గార్డెన్స్‌లో ఆదివారం మహిళాశక్తి సమ్మేళనం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న హైకోర్టు న్యాయమూర్తి ప్రసంగిస్తూ సంగీత, సాహిత్య కళారంగాల్లో, నాయకత్వ ప్రతిభలో భారతీయ మహిళ ప్రపంచానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. ఎన్నో శతాబ్దాలుగా ఎందరో మహిళలు పరిపాలనాదక్షులుగా, సాహిత్యవేత్తలుగా, స్వాతంత్ర్య వీరనారీమణులుగా ఈ దేశానికి తమ సేవలు అందించినట్లు తెలిపారు. స్వాతంత్ర్యం తర్వాత కూడా గొప్ప అత్యున్నత భావాలతో కాలక్రమంలో సమాజాన్ని పట్టిపీడిస్తున్న అనేక మహిళా వ్యతిరేక, సమాజ వ్యతిరేక రుగ్మతలను రూపుమాపడంలో కృషి చేశారని తెలిపారు. వారి జీవితాలను, ధైర్యసాహసాలు, ఆలోచనలను నేటి తరం స్ఫూర్తిగా తీసుకోవాల్సిన బాధ్యత ఎంతైనా ఉందన్నారు.

సమాజసేవకు కొంత సమయం..


సామాజిక కార్యకర్త వాణి సక్కుబాయి మాట్లాడుతూ ఎంతో మంది మహిళామూర్తులు దేశ పోరాటంలో నాయకత్వం వహించారని తెలిపారు. ఝాన్సీరాణి స్వాతంత్ర్య పోరాటంలో వీరోచితంగా పోరాడి ఎంతోమంది యువతులకు మార్గదర్శకంగా నిలిచారని అన్నారు. ఇలాంటి వారిని స్ఫూర్తిగా తీసుకొని మనం కూడా సమాజంలో ఉన్న మహిళలను జాగ్రత్తపరచాలని, అందుకు మనమంతా కొంత సమయం సమాజసేవ కోసం కేటాయించాలని సూచించారు. జాతీయ మానవ హక్కుల సంఘం సభ్యురాలు ఎస్.విజయభారతి మాట్లాడుతూ మహిళలకు జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలపై జాతీయస్థాయిలో పోరాటం చేయడానికి, మానవ హక్కుల కమిటీ ద్వారా సమస్యలను పరిష్కారం చేసుకోవడానికి మహిళలు ముందుకు రావాలని కోరారు. అంతకుముందు చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సమ్మేళనంలో కార్యక్రమ నిర్వాహకులు లక్ష్మి, సింధూజ, పద్మశ్రీ, దేదీప్య, పద్మ, వివిధ ధార్మిక సంస్థల మహిళా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



సమ్మేళనంలో పాల్గొన్న మహిళలు

మున్సిపల్ చైర్మన్‌గా ఆనంద్‌గౌడ్?

- ఇంకా కొలిక్కిరాని వైస్ చైర్మన్ ఎంపిక
- మద్దతిచ్చిన తమకే అవకాశం ఇవ్వాలన్న ఎంఐఎం



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పాలమూరు మున్సిపల్ కౌన్సిల్‌లో ఈనెల 27న అవిశ్వాస తీర్మానం నెగ్గడంతో ఇక చైర్మన్, వైస్‌చైర్మన్ పదవులు ఎవరిని వరిస్తాయో మరికొన్ని రోజుల్లో తేలనుంది. ఇప్పటి వరకైతే 21వ వార్డు కౌన్సిలర్ ఎ.ఆనంద్‌గౌడ్‌కే చైర్మన్ కావచ్చని కాంగ్రెస్ పార్టీ నేతలు చెబుతున్నారు. ఈ నెల 6న ఈయన ఆధ్వర్యంలోనే కలెక్టర్‌కు అవిశ్వాస తీర్మానం నోటీసు ఇచ్చారు. మెజారిటీ సభ్యుల మద్దతు కూడగట్టడంలో సఫలీకృతులయ్యారు. కొన్ని రోజుల పాటు కౌన్సిలర్లను విహారయాత్రల పేరిట క్యాంపు రాజకీయాలు నిర్వహించారు. చివరకు బీఆర్‌ఎస్ నుంచి 22 మంది కౌన్సిలర్లను తన వైపునకు తిప్పుకోగలిగారు. అలాగే ఎంఐఎం, బీజేపీ సభ్యుల సహకారం కలిసి వచ్చింది. వీరంతా చైర్మన్ ఎన్నికలో తనకు సహకరిస్తారని ఆయన ధీమాగా ఉన్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా వైస్‌చైర్మన్ పదవి ఎవరికి ఇవ్వాలన్నది మాత్రం ఓ కొలిక్కి రాలేదు. ఈ పదవికి నలుగురి పేర్లు వినిపిస్తున్నాయి. వీరిలో షబ్బీర్ అహ్మద్ (19వ వార్డు), మహబూబ్‌అలీ (29వ వార్డు), కె.స్వప్న (37వ వార్డు) ఉన్నారు. ఇదిలా ఉండగా కేవలం ఆరుగురు సభ్యులు కలిగిన కాంగ్రెస్ నుంచి ఏకంగా చైర్మన్ పదవి పొందనున్నారని.. బయట నుంచి మద్దతునిస్తున్న తమకే వైస్ చైర్మన్ పదవి దక్కాలని ఎంఐఎం సభ్యులు గట్టిగా అడుగుతున్నారు. తమ వల్లే కోరం సమస్య తలెత్తలేదని వారు చెబుతున్నారు. ఒకవేళ వారికి కేటాయిస్తే పార్టీ ఫ్లోర్ లీడర్ సాదతుల్లా (32వ వార్డు) కు అవకాశం దక్కవచ్చని అంటున్నారు. ఇక బీఆర్‌ఎస్‌కు చెందిన 14 మంది కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానానికి గైర్హాజరు కావడం తమకు కలిసొచ్చిందని కాంగ్రెస్ నేతలు భావిస్తున్నారు.

ఉన్నతాధికారులకు నివేదిక

కాగా, అవిశ్వాస తీర్మానానికి సంబంధించిన పూర్తి వివరాలను కలెక్టర్ జి.రవినాయక్ రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించారు. అక్కడి నుంచి వచ్చే ఆదేశాల తర్వాతే కొత్త చైర్మన్, వైస్ చైర్మన్‌ల ఎన్నిక ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఈ ప్రక్రియ చేపట్టడానికి ఇంకా ఎన్ని రోజులు పడుతుందో వారు స్పష్టం చేయడం లేదు.

కార్యదర్శుల సమస్యలు పరిష్కరిస్తా

- సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి
- పాలమూరు పార్లమెంట్ పంచాయతీ కార్యదర్శుల ఆత్మీయ సమ్మేళనం



మాట్లాడుతున్న చల్లా వంశీచందర్‌రెడ్డి

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): పంచాయతీ కార్యదర్శుల సమస్యలు తెలుసని, వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానని సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ పంచాయతీ కార్యదర్శుల ఆత్మీయ సమ్మేళనం జిల్లా కేంద్రంలోని ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులను, జూనియర్లుగా గుర్తించేందుకు కృషి చేస్తానన్నారు. గత ప్రభుత్వంలో కార్యదర్శులు అత్యంత శ్రమ దోపిడీకి గురయ్యారని తెలిపారు. ప్రసూతి సెలవులను 6 నెలలకు పెంచుతామని హామీ ఇచ్చారు. కార్యదర్శుల కృషితోనే తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. అలాంటి వారి సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఇతర పార్టీల మాదిరిగా మాట ఇచ్చి తప్పేది కాంగ్రెస్‌పార్టీ కాదన్నారు. ఏట రెండు కోట్ల ఉద్యోగాలు, రూ.15 లక్షలు ప్రతి ఒక్కరి అకౌంట్లలో వేస్తామని చెప్పిన బీజేపీ మాట తప్పిందన్నారు. సమస్యలు ఏమైన ఉంటే తన దృష్టికి తేవాలని కోరారు. పీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. కార్యదర్శుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం సానూకులంగా ఉందన్నారు. పంచాయతీ కార్యదర్శుల సంఘం రాష్ట్ర కోశాధికారి శిధర్, ఓపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు అజయ్ మాట్లాడుతూ.. ఓపీఎస్‌లను జేపీఎస్‌లుగా గుర్తించి వారి సర్వీసు కాలాన్ని పరిగణలోకి తీసుకోవాలన్నారు. పంచాయతీ కార్యదర్శుల స్పష్టమైన జాబ్ క్యాలెండర్ అమలు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న మహిళ కార్యదర్శుల ప్రసూతి సెలవుల వేతనాలను వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. జీఓ 317 ద్వారా నష్టపోయిన వారికి న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో లక్ష్మినారాయణ, శివప్రసాద్, పాండు, నరేందర్‌రెడ్డి, అశోక్, ప్రదీప్, అజయ్, దామోదర్, నర్మద, రాజు, లాలప్ప తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు



పరుగు ఎంపికల్లో పాల్గొన్న క్రీడాకారులు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాకేంద్రంలోని మెయిన్ స్టేడియంలో ఆదివారం జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు నిర్వహించారు. ఎంపికలకు జిల్లావ్యాప్తంగా 150 మంది బాలబాలికలు హాజరయ్యారు. అండర్–8 విభాగం వారికి 50మీ., 300మీటర్ల పరుగు, స్టాండింగ్ బ్రాడ్ జంప్, అండర్–10 వారికి 100 మీ., 300 మీ., లాంగ్‌జంప్, అండర్–12 విభాగంకు 100 మీ., 400 మీ., 600 మీటర్ల పరుగు, లాంగ్‌జంప్, షాట్‌పుట్, అండర్–14 విభాగంకు 100మీ., 400 మీటర్ల పరుగు ఎంపికలు నిర్వహించారు. జిల్లా అథ్లెటిక్స్ తుది జట్టు జాబితాను త్వరలో ప్రకటిస్తామని సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అథ్లెటిక్స్ సంఘం కార్యదర్శి జి.శరత్‌చంద్ర, కార్యనిర్వాహక కార్యదర్శి ఆనంద్, సంయుక్త కార్యదర్శి శ్రీనివాసులు, కోచ్ సునీల్, శ్రీనివాస్, పి.శ్రీనివాస్, రాజు, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు

దమ్ముంటే రాజీనామా చేయించి గెలిపించు

- ఎమ్మెల్యేకు సవాల్ విసిరిన మున్సిపల్ మాజీ చైర్మన్



మాట్లాడుతున్న మున్సిపల్ మాజీ చైర్మన్ కె.నర్సింహులు

మహబూబ్‌నగర్ న్యూటౌన్: కాంగ్రెస్ పార్టీలో చేర్చుకున్న బీఆర్‌ఎస్ కౌన్సిలర్లను పదవులకు రాజీనామా చేయించి గెలిపించాలని మున్సిపల్ మాజీ చైర్మన్ కె.నర్సింహులు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డికి సవాల్ విసిరారు. ఆదివారం జిల్లాకేంద్రంలో న్యూటౌన్‌లోని బిఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మీతో ఉన్న 35 మంది కౌన్సిలర్లను రాజీనామా చేయించాలని, మా నిఖార్సైన కౌన్సిలర్లు 14 మందిని రాజీనామా చేయిస్తామని, ప్రజా క్షేత్రంలో తేల్చుకుందామని సవాల్ విసిరారు. అన్ని విధాలుగా లబ్ధిపొంది బీఆర్‌ఎస్‌ను వీడటం ఎంతమాత్రం సమంజసం కాదని, పట్టణ ప్రజలు మీ ప్రవర్తనను గమనిస్తున్నారని అన్నారు. రాత్రికి రాత్రి పార్టీలు మారి సీనియర్ కాంగ్రెస్ నాయకులకు అన్యాయం చేసిన మీరు మమ్మల్ని డమ్మీలని మాట్లాడటం ఎమ్మెల్యే యెన్నం కుసంస్కారానికి నిదర్శనమన్నారు. హైదరాబాద్‌తో సమానంగా మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మహబూబ్‌నగర్‌ను అభివృద్ధి చేశారని అన్నారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన తనను అవమానపరిచేలా ఎమ్మెల్యే మాట్లాడటం సరికాదన్నారు. ఎమ్మెల్యే యెన్నం మాదిరి పార్టీలు మారే సంస్కృతి తనది కాదని, అలా చేయనందుకు డమ్మీనా అని ప్రశ్నించారు. ఎమ్మెల్యేగా యెన్నం గెలిచాక ప్రభుత్వ శాఖలను పంచుకొని కొందరు నాయకులు పనిచేస్తున్నారని, తామెప్పుడూ అలా చేయలేదన్నారు. మహబూబ్‌నగర్ పట్టణ అభివృద్ధికి ఎలాంటి అవినీతి అక్రమాలకు తావులేకుండా పనిచేశానని తెలిపారు. సమావేశంలో ముడా మాజీ చైర్మన్ గంజి వెంకన్న, శివరాజ్ పాల్గొన్నారు.

రాజ్యాధికారమే లక్ష్యంగా పోరాటం

- డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

ఎర్రవల్లి చౌరస్తా: రాజ్యాధికారమే అంతిమ లక్ష్యంగా బహుజనులు రాజకీయ పోరాటానికి సిద్ధం కావాలని బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్.ఎస్ ప్రవీణ్‌కుమార్ పిలుపునిచ్చారు. ఇటిక్యాల మండలంలోని సతర్లలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో బహుజన మహనీయుల విగ్రహాలతో పాటు బహుజనవాదం బలమైన శక్తిగా మారి, రాజకీయ ఉద్యమంగా మారితేనే బహుజన రాజ్యాధికారం దుక్కుతుందన్నారు. రాజ్యాధికారంతోనే బహుజనుల తలరాతలు మారుతాయన్నారు. ఈ దిశగా ప్రతిఒక్కరూ అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు ఎం.సీ కేశవరావు, నాయకులు ఎం.జి కృష్ణ, పృథ్వీరాజ్, రహమాన్ మధుగౌడ్, తిరుపాల్, రవిచంద్ర, శారద, జయ చంద్రారెడ్డి, ఎంపీటీసీ లతాచంద్రగౌడ్, రామన్న తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డా.ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

బీజేపీ విధానాలతో ఇబ్బందులు



మాట్లాడుతున్న రాములు

మహబూబ్‌నగర్ న్యూటౌన్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ విధానాలతో నిరుద్యోగులు, కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సీఐటీయూ రాష్ట్ర కోశాధికారి వంగూరి రాములు ఆరోపించారు. ఆదివారం ఇండస్ట్రీయల్ ఏరియాలోని భవన నిర్మాణ కార్మిక సంఘం భవనంలో ఉమ్మడి రైతు వ్యవసాయ కార్మిక సంఘాల జిల్లా సదస్సు నిర్వహించారు. బీజేపీ వినాశకరమైన అభివృద్ధి నిరోధక విధానాలు ప్రమాదకరంగా మారాయన్నారు. వారి పాలనలో దేశంలో 50 శాతం నిరుద్యోగం పెరిగిందని, 20 శాతం కార్మికుల వేతనాలు పడిపోయాయన్నారు. దేశంలోని పలు సమస్యలను పక్కదారి పట్టించారని ఆరోపించారు. ఫిబ్రవరి 16న జరిగే సమ్మెలో సకల కార్మికులు, రైతు, వ్యవసాయ కూలీలు పెద్దఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. జిల్లా కార్యదర్శి కురుమూర్తి, కిల్లెగోపాల్, ఆయా సంఘాల నాయకులు రామ్మోహన్, శ్రీనివాసులు, రాములు, కె.మోహన్, లక్ష్మయ్య, గోనెల రాములు, వరద గాలెన్న, ఆనంద్, ఎర్రశ్రీనివాసులు, చంద్రకాంత్, జగన్, హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

తండ్రి డబ్బులు ఇవ్వలేదని యువకుడి బలవన్మరణం


మనోహర్ రెడ్డి (ఫైల్)

ఉండవెల్లి: చికిత్స పొందుతూ యువకుడు కర్నూల్ ఆస్పత్రిలో మృతి చెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. ఎస్ఐ బాల్‌రాజు వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన మద్దిలేటిరెడ్డి(పెద్దబాబు) కుమారుడు మనోహర్‌రెడ్డి(33) శనివారం సాయంత్రం డబ్బులు కావాలని తండ్రిని అడగడంతో తన దగ్గర లేవని, తనను అడగవద్దని సమాధానం ఇచ్చాడు. డబ్బులు ఇవ్వకుంటే తాను చనిపోతానని అన్నాడు. ఎప్పుడనే మాటలే అని కల్లంలో మేకలు కట్టేయడానికి మద్దిలేటిరెడ్డి వెళ్లాడు. ఈ క్రమంలో మనోహర్‌రెడ్డి ఇంటి తలుపులు మూసి పురుగుల మందు తాగాడు. అది గమనించిన చిన్నాన్న కుమారుడు రాజేశ్వర్‌రెడ్డి కిటికీల నుంచి చూసి తలుపులు బద్దలుగొట్టి అతన్ని కర్నూలు ఆస్పత్రికి బైక్ మీద తీసుకెళ్లారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున 2 గంటల సమయంలో మృతి చెందాడు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బాల్‌రాజు తెలిపారు.

భార్యతో గొడవ పడి భర్త..

నవాబుపేట: పురుగుల మందుతాగి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలం లోని రేకులచౌడాపూర్‌కు చెందిన కుమ్మరి నర్సింహులు(45) 20వ తేదీన మద్యం మత్తులో భార్యతో గొడవపడి ఇంటి నుంచి ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయాడు. గ్రామ శివారులోని వ్యవసాయ పొలంలో పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ విషయం తెలిసిన వెంటనే అతని భార్య, బంధువులు అతన్ని జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. అతని భార్య లక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ సుదీర్‌బాబు తెలిపారు.

భార్య కాపురానికి రావడం లేదని..


బాలచంద్రయ్య (ఫైల్)

కొత్తకోట రూరల్: భార్య కాపురానికి రాకపోవడంతో మనస్తాపానికి గురైన భర్త పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన వనపర్తి జిల్లా కొత్తకోట మండలం అప్పరాలలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. అప్పరాలకు చెందిన బాలచంద్రయ్య (35), మహేశ్వరి భార్యాభర్తలు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేసే బాలచంద్రయ్య కొన్ని రోజులుగా తాగుడుకు బానిసయ్యాడు. దీంతో భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు చోటుచేసుకునేవి. ఈ క్రమంలో నెలరోజుల కిందట మహేశ్వరి భర్త, పిల్లలను వదిలేసి పుట్టింటికి వెళ్లిపోయింది. ఆమె కాపురానికి రాకపోవడంతో జీవితంపై విరక్తి చెందిన బాలచంద్రయ్య.. ఆదివారం మధ్యాహ్నం ఇంట్లోనే పురుగుల మందు తాగాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు అతడిని చికిత్స నిమిత్తం వనపర్తి జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే బాలచంద్రయ్య మృతిచెందినట్లు నిర్ధారించారు. కాగా ఈఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ మంజునాథ్‌రెడ్డి తెలిపారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

కోస్గి: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ యువకుడు జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యాయత్నం చేసిన సంఘటన ఆదివారం పట్టణంలో చోటుచేసుకుంది. బాధితుల కథనం ప్రకారం.. పట్టణంలోని బహార్‌పేటకు చెందిన వెంకటయ్య కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి పైకప్పు దూలానికి ఉరి వేసుకున్నాడు. అప్పుడే వచ్చిన అతని కుమారుడు అప్రమత్తపై చుట్టుపక్కల వారికి విషయం తెలియజేయగా.. వారంతా వచ్చి తాడును తొలగించారు. అపస్మారక స్థితిలో ఉన్న అతడిని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో పాలమూరు జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. అత్యవసర విభాగంలో చికిత్స అందిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలియజేశారు.

వాగులో ప్రమాదవశాత్తు కాలు జారి వ్యక్తి మృతి

మదనాపురం: ప్రమాదవశాత్తు వాగులో పడి శివ మాలధారుడు మృతి చెందిన ఘటన మదనాపురం మండలం దంతనూరులో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. దంతనూరుకు చెందిన శ్రీనివాసులు (55) ఐదు రోజుల కిందట శివమాల ధరించాడు. రోజు మాదిరిగా ఆదివారం మధ్యాహ్నం స్నానం చేసేందుకు గ్రామ సమీపంలోని ఊకచెట్టు వాగుకు వెళ్లాడు. స్నానమాచరించిన అనంతరం రామన్‌పాడు నుంచి జడ్చర్లకు తాగు నీటిని సరఫరా చేసే పైపులైన్‌పై కూర్చొని దుస్తులు ఉతుకుతుండగా.. ప్రమాదవశాత్తు కాలుజారి నీటిలో పడ్డాడు. ఎవరూ గమనించకపోవడంతో నీటిలో మునిగి మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

అన్ని శాఖల్లో అలర్ట్

ప్రభుత్వ అధికారుల్లో కలవరం

- ఈ నెలలో రెండు కేసులు నమోదు
- అధికారులు, సిబ్బంది పనితీరుపై ఏసీబీ అధికారుల నజర్
- బాధితులు ధైర్యంగా ఫిర్యాదు చేయాలి



మహబూబ్‌నగర్ క్రైం: జిల్లాలో తాజాగా లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండ్‌గా జడ్చర్ల ఎక్సైజ్ సీఐ పట్టుబడటంతో అన్ని రకాల ప్రభుత్వ ఉద్యోగుల్లో కలవరం మొదలైంది. ప్రధానంగా ఉమ్మడి ఎక్సైజ్ శాఖలో అధికారులు అలర్ట్ అయ్యారు. కనీసం ఫోన్‌లో కూడా లైసెన్స్ వ్యవహారాలు, ఇతర కేసుల అంశాలపై మాట్లాడటానికి జంకుతున్న పరిస్థితి కన్పిస్తోంది. ఇదే శాఖలో పనిచేసే ఒకరిద్దరూ అధికారులు గతంలో చేసిన తప్పిదాలు ఎక్కడ బయట పడుతాయోనని టెన్షన్ పడుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే జడ్చర్ల సీఐ వ్యవహారంపై ఆ శాఖ ఉన్నత అధికారులు అసలు ఏం జరిగింది అనే అంశంపై విచారణ చేయడానికి సిద్ధం అయినట్లు తెలుస్తోంది. ఈ నెల 20న కల్వకుర్తి ఆర్డీఓ కార్యాలయంలో పనిచేసే డివిజన్ సర్వేయర్ వశ్యానాయక్ రూ.8 వేలు లంచం తీసుకుంటున్న సమయంలో రెడ్‌హ్యాండ్‌గా పట్టుకున్నారు. ఈ ఘటన మరువకముందే జడ్చర్ల ఎక్సైజ్ సీఐ బాలాజీ టీఎఫ్‌టీ లైసెన్స్ జారీ కోసం రూ.65 వేలు లంచం తీసుకుంటున్న క్రమంలో ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఈ నెలలో రెండు కేసులు నమోదు కావడం విశేషం. గతేడాది ఉమ్మడి జిల్లాలో ఏడు కేసులు నమోదయ్యాయి. అవినీతి అధికంగా జరుగుతున్న శాఖలను పరిశీలిస్తే రెవెన్యూ, విద్యుత్, పోలీస్‌శాఖ, రవాణా, వాణిజ్య పన్నుల శాఖ, ఎక్సైజ్ శాఖలో అవినీతి భారీ స్థాయిలో జరుగుతోంది.

రెండు కేసులు నమోదు..

గతేడాది ఉమ్మడి జిల్లాలో ఏడుగురు ప్రభుత్వ ఉద్యోగులు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. ఇక ఈ ఏడాదిలో 23 రోజుల వ్యవధిలో ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగులు పట్టుబడ్డారు. ఈసారి పట్టుబడిన దాంట్లో రెవెన్యూ, ఎక్సైజ్ శాఖలకు సంబంధించిన ఉద్యోగులు ఉన్నారు. గతేడాది నమోదయిన ఏడు కేసుల్లో నాలుగు కేసులు నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్‌లో రెండు, వనపర్తి జిల్లాలో ఒక కేసు నమోదయ్యింది. ఈ ఏడాది పట్టుబడిన దాంట్లో కోడేర్ డిప్యూటీ తహసీల్దార్ పురుషోత్తం, కోడేర్‌లో సర్వశిక్ష అభియాన్‌లో పనిచేసే సైట్ ఇంజినీర్ మహేందర్, చారకొండ తహసీల్దార్ నాగమణి, నంచర్ల పంచాయతీ కార్యదర్శి పాండు రంగయ్య, ఆత్మకూర్‌లో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నర్సింహులు, కల్వకుర్తి ఏఎస్ఐ వి.ఆంజనేయులుతో పాటు నవాబుపేట ఎస్ఐ పురుషోత్తంపై వచ్చిన ఆరోపణలపై హైదరాబాద్ ఏసీబీ అధికారులు కేసు నమోదు చేసి జైలుకు తరలించారు.

నేరం రుజువైతే ఉద్యోగం పోయినట్లే

లంచం తీసుకుంటూ దొరికిన ఉద్యోగులను ఏసీబీ అధికారులు 24 గంటల్లో కోర్టు ఎదుట హాజరుపరుస్తారు. చాలా వరకు బెయిల్ దొరకదు. కోర్టు రిమాండ్‌కు తరలిస్తుంది. కోర్టులో నేరం రుజువయితే ఆరేళ్ల వరకు జైలు శిక్ష, జరిమానా విధించే అవకాశం ఉంటుంది. అవినీతి ఉద్యోగులు, అధికారుల ఆస్తులను కోర్టు స్వాధీనం చేసుకుంటుంది. నేరం రుజువైతే వాటిని ప్రభుత్వం జప్తు చేస్తుంది. లంచం తీసుకుంటూ పట్టుబడిన వారు జైలులో ఉండాల్సి వస్తుంది. వారిని ప్రభుత్వం సస్పెండ్ చేస్తోంది. పెండింగ్ విచారణ పేరుతో ఉద్యోగంలోకి తీసుకున్నా కేసు పూర్తయే వరకు ఇబ్బందులు తప్పవు. పదోన్నతులు, ఇంక్రిమెంట్లు, ఇతర సౌకర్యాలు కోల్పోతారు. కోర్టులో నేరం రుజువైతే జైలు శిక్షతో పాటు ఉద్యోగం నుంచి పూర్తిగా తొలగిస్తారు.

- అవినీతి నిరోధక శాఖలో పీసీ యాక్ట్ 1988(సవరణ చట్టం 2018) ప్రకారం బాధితుడి నుంచి డబ్బులు డిమాండ్ చేసి లంచం రూపంలో తీసుకుంటే పీసీ 7(ఎ) ప్రకారం 7 ఏళ్ల జైలు శిక్షతో పాటు జరిమానా ఉంటుంది. ఇక పని చేసిన తర్వాత కూడా డబ్బులు డిమాండ్ చేసి లంచం తీసుకుంటే పీసీ యాక్ట్ 7(బి) ప్రకారం కూడా జైలు శిక్ష ఉంటుంది. 2018 తర్వాత ప్రభుత్వ అధికారి డబ్బులు కాకుండా గిఫ్ట్, ఏదైనా వస్తువు ఇలా ఏది తీసుకున్నా.. పీసీ యాక్ట్ పరిధిలోకి వస్తుంది. ప్రభుత్వ అధికారులు బాధితుడిని డబ్బులు డిమాండ్ చేసినట్లు ఏసీబీ అధికారులు ఆధారాలతో నేరం నిరూపించినా.. సదరు అధికారిపై కేసు నమోదు చేసేలా కొత్త చట్టం చెబుతుంది.
- ఆదాయానికి మించి ఆస్తులు ఉంటే సెక్షన్-13(1)(సి) ప్రకారం చర్యలు తీసుకుంటారు.
- విధి నిర్వహణలో అవకతవకలకు పాల్పడినా, నిర్లక్ష్యంగా వ్యవహరించినా, ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేసినా సెక్షన్-13(1), (ఎనుంచి డి) వరకు అవినీతి నిరోధక చట్టం 1988 ప్రకారం కేసులు పెడతారు.
- అక్రమ ఆస్తి కూడబెట్టడంలో సహకరించిన బంధువులు, స్నేహితుల మీద ఐపీసీ 109 సెక్షన్ ప్రకారం చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది.

ఏడాది	నమోదయిన కేసులు
2015	18
2016	7
2017	5
2018	5
2019	11
2020	10
2021	9
2022	6
2023	7

అధికారుల దృష్టికి తీసుకురావాలి...

ప్రభుత్వ శాఖలో పని చేసే అధికారులు ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే అలాంటి సమాచారం ఏసీబీ అధికారుల దృష్టికి తీసుకురావాలి. ముందుగా కొంత డబ్బులు ఇచ్చి ఆ తర్వాత సమాచారం ఇవ్వడం కాకుండా ముందే ఇవ్వాలి. ఒకవేళ తప్పనిపరిస్థితిలో కొంత డబ్బులు ఇచ్చినా.. వారం రోజుల వ్యవధిలో ఏసీబీ అధికారులకు సమాచారం ఇవ్వాలి. ఒకవేళ ఆలస్యం చేస్తే డబ్బులు ఇచ్చిన వ్యక్తులపై కూడా కేసులు నమోదు చేస్తాం. కొత్తగా వచ్చిన చట్ట ప్రకారం బాధితులు వ్యవహరించాలి. సమాచారం ఇచ్చే వివరాలు ఎప్పుడు గొప్యంగా ఉంచుతాం.

– శ్రీకృష్ణగౌడ్, ఏసీబీ డీఎస్పీ

జాతీయ రహదారిపై తప్పిన ప్రమాదం

- ఏపీ ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన కంటెయినర్ లారీ
- ఇద్దరికి తీవ్రగాయాలు, 13మందికి స్వల్ప గాయాలు


జాతీయ రహదారిపై బస్సును ఢీకొట్టిన కంటెయినర్ లారీ

ఎర్రవలిచౌరస్తా: జాతీయ రహదారిపై బస్సును కంటైనర్ లారీ ఢీ కొన్న ఘటన ఆదివారం చోటుచేసుకుంది.. కోదండాపురం ఎస్ఐ కృష్ణదేవ్, పెట్రోలింగ్ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. జాతీయ రహదారి-44పై హైదరాబాద్ నుంచి కర్నూల్ వైపు వెళ్తున్న ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూల్ జిల్లా బనగానపల్లి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సును కర్నూల్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కంటెయినర్ లారీ అతివేగంగా వచ్చి ఢీ కొట్టింది. ఈ ఘటనలో బస్సులో ఉన్న ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా, మరో 13మందికి స్వల్ప గాయాలైనట్లు ఎస్ఐ తెలిపారు. బస్సులో సుమారు 45 మందికి పైగా ఉన్నారని, ఎవ్వరికి ఎలాంటి ప్రమాదం కాలేదన్నారు. గాయాలైన వారిని హైవే అంబులెన్స్‌లో కర్నూల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఘటనా స్థలం వద్ద లారీ జాతీయ రహదారికి అడ్డుగా ఉండటంతో 3కిలోమీటర్ల మేరకు భారీగా ట్రాఫిక్ జాం అయ్యింది. వెంటనే కోదండాపురం, మానవపాడుకు చెందిన పోలీసులు చేరుకుని వాహనాలను క్రమబద్ధీకరించారు.


జాతీయ రహదారిపై నిలిచిపోయిన వాహనాలు

జోరుగా మొర్రంమట్టి దందా

- భీమా కాల్వ గట్టు నుంచి యథేచ్ఛగా తరలింపు
- పట్టించుకోని అధికారులు

అమరచింత: మొర్రంమట్టి దందా జోరుగా సాగుతోంది. భీమా కాల్వ గట్టు నుంచి కొందరు అక్రమార్కులు మొర్రంమట్టిని యథేచ్ఛగా తరలిస్తూ, సొమ్ము చేసుకుంటున్నారు. మక్తల్ సెగ్మెంట్‌లోని భూత్పూర్ రిజర్వాయర్ నుంచి అమరచింత, ఆత్మకూర్ మండలాల వరకు భీమా కాల్వ ఉంది. అమరచింత పెద్ద చెరువు నుంచి నాగిరెడ్డిపల్లి వరకు భీమా కాల్వ గట్టు నుంచి మొర్రంమట్టిని అక్రమంగా తరలిస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. పదేళ్లుగా కొందరు మొర్రంమట్టి దందా సాగిస్తున్నా.. అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. అధికారులు, బడా నాయకుల అండదండలతో అక్రమార్కులు మొర్రంమట్టి దందాను మూడు ట్రాక్టర్లు.. ఆరు టిప్పర్లు అన్న చందంగా సాగిస్తున్నారు. జేసీబీ, ఇటాచీల సహాయంతో నిత్యం మొర్రంమట్టిని తరలిస్తుండటంతో కాల్వ గట్టు మైదానంలా మారుతోంది. కాల్వకు గండి ఏర్పడితే.. పూడ్చడానికి మట్టి ఉండాలనే ఉద్దేశంతో నిల్వ ఉంచిన మొర్రం మట్టిని బారీ వాహనాల్లో అక్రమంగా తరలించడంపై పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మొర్రంమట్టి దందాకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.


పాంరెడ్డిపల్లి శివారులో భీమా కాల్వ వద్ద మొర్రంమట్టిని తవ్వుతున్న ఇటాచీ

పేదరికానికి.. కరెంటు కాటు

- షార్ట్ సర్క్యూట్‌తో గుడిసె దగ్ధం
- సర్వం కోల్పోయి కట్టుబట్టలతో మిగిలిన కుటుంబం


విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధమైన గుడిసె

హన్వాడ: అసలే పేదరికం.. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో నివాస గుడిసె దగ్ధం కావడంతో ఆ కుటుంబం కట్టుబట్టలతో మిగిలింది. వివరాల్లోకి వెళ్తే.. మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలం గొండ్యాల్‌కు చెందిన మాశమోని సత్యయ్య, అనిత భార్యభర్తలు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. గ్రామ శివారులో తమకున్న ఎకరం పొలంలో చిన్నపాటి పూరిగుడిసె వేసుకుని జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం గుడిసెలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ఏర్పడి మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు మంటలను ఆర్పివేసేందుకు యత్నించినా ఫలితం లేకపోయింది. గుడిసె మొత్తం పూర్తిగా కాలిపోయింది. దీంతో నిత్యావసర వస్తువులు, వంట సామగ్రి, ఎలక్ట్రానిక్ వస్తువులు, 4 బస్తాల బియ్యంతో పాటు ఇతర ధాన్యం బస్తాలు తదితరాలన్నీ అగ్నికి ఆహుతయ్యాయి. కుటుంబ సభ్యులు కట్టుబట్టలతో మిగిలారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

గడ్డి వాములు దగ్ధం

గద్వాల క్రైం: ప్రమాదవశాత్తు గడ్డి వాములు దగ్ధమైన ఘటన ఆదివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. బాధితుడు కథనం మేరకు.. జిల్లా కేంద్రంలోని దౌదర్‌పల్లి కాలనీకి చెందిన నరేష్ మేలచెర్వు శివారులో వ్యవసాయ పొలంలో గడ్డి వాములు నిల్వ చేసుకున్నాడు. ప్రమాదవశాత్తు తెల్లవారు జామున మంటలు వ్యాపించి గడ్డి వాములు దగ్ధమయ్యాయి. మంటలు అదుపు చేసేందుకు ఫైర్ సిబ్బంది ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. గడ్డి విలువ రూ.లక్ష ఉంటుందని బాధితుడు పేర్కొన్నాడు.

వేములలో విషాదం


ఉండ్యాల రాజేశ్వర్‌రెడ్డి(ఫైల్)

తిరుమల మెట్ల మార్గంలో యువకుడి మృతి

అడ్డాకుల: మూసాపేట మండలం వేములలో విషాదం అలుముకుంది. వేములకి చెందిన ఉండ్యాల శ్రీనివాస్‌రెడ్డి, అంజమ్మ దంపతుల పెద్ద కుమారుడు ఉండ్యాల రాజేశ్వర్‌రెడ్డి(23) బీటెక్ పూర్తి చేసి హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. ఈ క్రమంలో తన స్నేహితుడితో కలిసి శనివారం తిరుపతి వెళ్లాడు. కింది నుంచి మెట్ల మార్గం ద్వారా తిరుమలకు వెళ్తున్నాడు. మార్గమధ్యలో మెట్ల మార్గంలోనే మధ్యాహ్నం గుండెపోటుకు గురయ్యాడు. అక్కడున్న యాత్రికులు ఆస్పత్రికి తరలించే ప్రయత్నం చేశారు. అంతలోనే రాజేశ్వర్‌రెడ్డి ప్రాణాలు వదిలాడు. దైవదర్శనానికి వెళ్లిన కుమారుడు మృతిచెందిన విషయం తెలుసుకుని కుటుంబసభ్యులు బోరున విలపించారు. బంధువులు తిరుపతికి వెళ్లి యువకుడి మృతదేహాన్ని ఆదివారం సాయంత్రం స్వగ్రామానికి తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సంఘటనతో గ్రామంలో విషాదం అలుముకుంది.

వాహనం ఢీకొని బిహార్ వాసి మృతి

జడ్చర్ల: వాహనం ఢీకొని బిహార్ వాసి మృతి చెందిన ఘటన మండలంలోని మల్లెబోయిన్‌పల్లి శివారులో జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. సీఐ రమేష్ బాబు తెలిపిన వివరాల ప్రకారం.. బిహార్‌లోని నండ్పూర్ చెందిన మంటు కుమార్(27) తన తండ్రి నవాల్ మెహతో, సోదరుడు ఓం ప్రకాష్‌తో కలిసి ఉపాధి నిమిత్తం వచ్చి మహబూబ్‌నగర్‌లో నివాసం ఉంటూ సీసీ రోడ్డు పనులు చేసేందుకు కుదిరారు. ఈ క్రమంలో నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లిలో సీసీ రోడ్డు పనులు చేసేందుకు వెళ్లారు. శనివారం సాయంత్రం బీహార్ వెళ్లేందుకు బిజినేపల్లి నుంచి బయలు దేరారు. అదేరోజు రాత్రి 11:15 గంటల ప్రాంతంలో జాతీయ రహదారిపై రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని మంటు కుమార్ మృతి చెందాడు. ప్రమాదంలో మృతదేహం పూర్తిగా ఛిద్రమైంది. ఆదివారం మృతుడి తండ్రి నవాల్‌మెహతో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య

పాలమూరు: రైలు కిందపడి ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రైల్వే ఎస్ఐ అక్బర్ వివరాల మేరకు.. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని బోయపల్లి గేట్ సమీపంలో ఆదివారం రాత్రి గుర్తు తెలియని యువకుడు(25) హంద్రీ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైలు వేగంగా ఉండటంతో యువకుడి శరీర భాగాలు చెల్లాచెదురయ్యాయి. అతడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు వెల్లడించారు.

కడుపునొప్పి భరించలేక..

హన్వాడ: కడుపునొప్పి భరించలేక ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన చోటుచేసుకుంది. గొండ్యాల్‌కు చెందిన బోయిని హన్మంతు (60) కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. ఆదివారం తెల్లవారుజామున కడుపునొప్పి తీవ్రం కావడంతో భరించలేక ఇంట్లో ఉన్న పురుగు మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు అతడిని జిల్లా ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య నాగమ్మ, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు.

వరిపంటకు తెగుళ్ల బెడద


కేటీదొడ్డిలో మొగిపురుగుతో ఎర్రబడిన పొలం

- ఆందోళనలో అన్నదాతలు
- క్రిమిసంహారక మందులతో పెరుగుతున్న పెట్టుబడి
- మళ్లీ నాటేయడంతో అదనపు భారం

కేటీదొడ్డి: యాసంగి సీజన్‌లో వరిపంట సాగు చేసిన రైతులకు ఆదిలోనే కష్టాలు మొదలయ్యాయి. వరినాట్లేసిన వెంటనే మొగి, వేరు పురుగు సోకడంతో ఆందోళన చెందుతున్నారు. జింక్ లోపంతో పంట ఎదుగుదల లేకపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తెగుళ్ల నివారణకు క్రిమిసంహారక మందులను ఉపయోగించినప్పటికీ ప్రయోజనం లేకపోవడంతో కొంతమంది రైతులు మళ్లీ నాట్లేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో గతేడాది యాసంగిలో 6.52లక్షల ఎకరాల్లో వరిసాగు చేయగా.. ఈ ఏడాది ఇప్పటి వరకు 52వేల ఎకరాల్లో మాత్రమే సాగు చేశారు.

నారు దశలోనే తెగుళ్ల దాడి

వాతావరణంలో వచ్చిన మార్పులతో నారు దశలోనే మొగిపురుగు సోకడంతో రైతులు రెండు, మూడు పర్యాయాలు క్రిమి సంహారక మందులను పిచికారి చేయాల్సి వచ్చింది. గతంలో వరిపంట పొట్టదశలో మొగిపురుగు ఆశించగా ప్రస్తుతం నాట్లేసిన పది, పదిహేనురోజుల్లోనే సోకడంతో వరికర్రలు కుళ్లిపోతున్నాయి. అంతేకాకుండా జింక్‌లోపంతో మొక్కల ఎదుగుదల లోపించడమే కాకుండా ఎర్రబారుతున్నాయి. ప్రధానంగా గువ్వలదిన్నె, కేటీదొడ్డి, కొండాపురం, నందిన్నె, ఇర్కిచేడు గ్రామాల్లో మొగిపురుగు, జింక్ లోపం ఎక్కువగా ఉంది. దుక్కి దున్నడం, వరినాట్లేసేందుకు ఎకరానికి రూ.20వేల వరకు రైతులు పెట్టుబడి పెట్టారు. తెగుళ్లు సోకతుండటంతో నివారణ కోసం క్రిమిసంహారక మందుల కోసం అదనంగా మరో రూ.10వేలు ఖర్చు పెట్టాల్సి వస్తోందని రైతులు తెలిపారు. పంట చేతికందే వరకు పెట్టుబడుల భారం మరింత పెరిగే అవకాశముందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


కొండాపురంలో మొగిపురుగు సోకిన పొలం

మందులు చల్లినా లాభం లేదు



మూడెకరాల్లో వరిపంట వేశా, మొగిపురుగు, రెక్కల పురుగు సోకడంతో పంట ఎదుగుదల లోపించింది. వరికర్రలు చనిపోతుండటంతో దిమ్మెట గుళికలు వేసినా లాభం లేకుండా పోయింది. తెగుళ్లతో అదనపు పెట్టుబడి పెరుగుతుంది. – చిన్నరాములుగౌడ్, కేటీదొడ్డి

మళ్లీ నాటేశాను..



రెండు ఎకరాల్లో వరినాటేయగా మొగిపురుగు సోకి పంటంతా రూపు కోల్పోయింది. క్రిమి సంహారక మందులు వాడినప్పటికీ పంట పూర్తిగా కోలుకోకపోవడంతో ఎకరన్నరలో మళ్లీ వరి నాటేశా. పొలం దున్ని మళ్లీ నాటేయడానికి ఆదనంగా రూ.20 వేల వరకు ఖర్చయ్యింది. –తాయప్ప, కేటీదొడ్డి

గుళికలు వేయాలి..

వరి నాటేసేందుకు వారం రోజుల ముందు నారుపై కిలో కార్బోఫ్యూరిడాన్ 3జీ గుళికలు లేదా కార్టప్ హైడ్రోక్లోరైడ్ 4జీ గుళికలు చల్లాలి. వరి నాటేశాక 25 రోజుల్లోపు మొగిపురుగు నివారణకు ఎకరానికి 5 కిలోల కార్బోఫ్యూరిడాన్3జీ గుళికలను ఇసుకను కలిపి చల్లాలి.

– మహలక్ష్మి, ఏఓ, కేటీదొడ్డి

బంగారు, వెండి ఆభరణాలు చోరీ

గద్వాల క్రైం: తాళం వేసిన ఇంట్లోకి చొరబడి బంగారు, వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లిన ఘటన ఆదివారం తెల్లవారుజామున గద్వాల పట్టణంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పాత హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన శ్రీనివాస్ శాస్త్రీ రెండు రోజుల క్రితం పని నిమిత్తం ఇంటికి తాళం వేసి హైదరాబాద్ వెళ్లాడు. ఈ క్రమంలో గుర్తు తెలియని దుండగులు తెలవారు జామున తాళం ధ్వంసం చేసి బీరువాలో ఉన్న మూడు తులాల బంగారం, అర కిలో వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లారు. ఉదయం గుర్తించిన స్థానికులు సదరు వ్యక్తికి, పోలీసులకు సమాచారం అందించారు. పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కాలనీలోని పలువురు అనుమానిత వ్యక్తులపై ఆరా తీశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు.

పుస్తెలతాడు చోరీ

కోడేరు: వ్యవసాయ పనులు ముగించుకొని ఇంటికి వస్తున్న మహిళను గుర్తు తెలియని దుండగులు బెదిరించి మెడలోని మూడు తులాల బంగారు పుస్తెలతాడును అపహరించుకెళ్లిన ఘటన ఆదివారం కోడేరు మండల పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ శేఖర్‌రెడ్డి కథనం ప్రకారం.. మండలంలోని తీగలపల్లికి చెందిన పుష్పావతి పొలం పనులు ముగించుకొని ఇంటికి వస్తుండగా గ్రామశివారు సబ్‌స్టేషన్ సమీపంలో కల్వర్టు వద్ద తీగలపల్లికి ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చారు. మహిళను కత్తితో బెదిరించి మెడలో ఉన్న మూడు తులాల బంగారు పుస్తెలతాడును తీసుకెళ్లారు. ఇద్దరు దొంగలు హెల్మెట్ పెట్టుకోవడంతో గుర్తు పట్టలేదని తెలిపింది. ఈ విషయంపై కోడేరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

హిందుత్వను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో మోదీ సక్సెస్

- డిజిటల్, సామాజిక మాధ్యమాలను సమర్థవంతంగా వినియోగించుకున్నారు
- దేశభక్తి వేరు, జాతీయత వేరు
- పుస్తకాలు బాగా చదివితేనే ఉత్తమ రచనలు చేయవచ్చు
- హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్‌లో అజయ్ గాంధీ స్మారక ప్రసంగం చేసిన శశిథరూర్



కార్యక్రమంలో శశిథరూర్, సునీతారెడ్డి

సాక్షి, హైదరాబాద్: దేశవ్యాప్తంగా 'హిందుత్వ'ను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ప్రధాని మోదీ విజయవంతమయ్యారని పార్లమెంట్ సభ్యుడు, ప్రముఖ రచయిత శశిథరూర్ అన్నారు. సామాజిక మాధ్యమాలను, డిజిటల్ సాంకేతిక వ్యవస్థలను ఆయన సమర్థవంతంగా వినియోగించుకున్నారని చెప్పారు. హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్ ముగింపు ఉత్సవాల్లో భాగంగా ఆదివారం హైటెక్‌సిటీ సత్వ నాలెడ్జ్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్ వ్యవస్థాపక డైరెక్టర్, దివంగత అజయ్ గాంధీ స్మారకోపన్యాసం చేశారు. ఈ కార్యక్రమానికి హెచ్‌ఎల్‌ఎఫ్ వ్యాఖ్యాత సునీతా రెడ్డి సమన్వయకర్తగా వ్యవహరించారు. శశిథరూర్ మాట్లాడుతూ, 2018లో తాను రాసిన 'ది పారాడాక్సికల్ ప్రైమ్ మినిస్టర్'గ్రంథానికి పెద్దగా ఆదరణ లభించలేదని, కానీ ప్రధాని మోదీ పదేళ్ల పదవీకాలాన్ని పూర్తి చేసుకుంటున్న ప్రస్తుత తరుణంలో ఆ పుస్తకం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిందని పేర్కొన్నారు. సాంకేతిక వ్యవస్థలను వినియోగించుకోవడం ద్వారా హిందుత్వ భావజాలాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడంలో మోదీ ఆలోచనా విధానాన్ని మాత్రమే తాను ప్రస్తావిస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా జాతీయత, దేశభక్తి భావాల పట్ల మీ అభిప్రాయం ఏమిటి? అని సునీతారెడ్డి ప్రశ్నించగా, అవి రెండూ వేర్వేరని చెప్పారు. దేశభక్తి అంటే తల్లి పట్ల బిడ్డలకు ఉండే భావోద్వేగభరితమైన ప్రేమ వంటిదని, దేశభక్తులు తమ దేశం కోసం ప్రాణాలను తృణప్రాయంగా సమర్పించేందుకు సిద్ధంగా ఉంటారని చెప్పారు. కానీ జాతీయత రాజకీయ నిర్మాణంలో భాగమని పేర్కొన్నారు. జాతీయతావాదం కంటే దేశభక్తే గొప్పదన్నారు. దేశానికి కావలసింది దేశభక్తులని చెప్పారు. ఐక్యరాజ్యసమితి, ప్రపంచ ఆరోగ్యసంస్థ వంటి అంతర్జాతీయ సంస్థలు ప్రాముఖ్యతను కోల్పోయాయని ఇటీవల శ్యామ్ పిట్రోడా చేసిన వ్యాఖ్యలపైన ఆయన స్పందించారు. అంతర్జాతీయ సంస్థల ఏర్పాటులోనే చాలా ఆలస్యం జరిగిందని అన్నారు. ఇప్పుడు వాటిని పక్కన పెట్టడం ముఖ్యం కాదన్నారు. ఐక్యరాజ్యసమితి వంటి సంస్థలను కాపాడుకోవాలని, వాటిని మరింత బలోపేతం చేసుకోవలసిన అవసరముందని చెప్పారు. ఇందుకోసం భారత్ ప్రధాన బాధ్యత తీసుకోవాలని సూచించారు.

విస్తృత అధ్యయనం వల్లనే ఉత్తమ రచనలు

అన్ని రకాల పుస్తకాలను విస్తృతంగా, లోతుగా అధ్యయనం చేసినప్పుడే ఉత్తమ రచనలు చేయడం సాధ్యమవుతుందని ఒక ప్రశ్నకు సమాధానంగా శశిథరూర్ చెప్పారు. పుస్తకాల అధ్యయనంలోనూ వైవిధ్యం ఉండాలని సూచించారు. అలాగే పదసంపదను కూడా బాగా పెంచుకోవాలని, అప్పుడు మాత్రమే స్పష్టంగా రాయలగుతారని పేర్కొన్నారు. తాను రాసిన 'ఎ వరల్డ్ ఇన్ 100 ఎస్సేస్'పుస్తకం త్వరలో వెలువడనుందని చెప్పారు. ఈ పుస్తకాన్ని చదవడం వల్ల పదజాలాన్ని పెంపొందించుకోవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎల్‌ఎఫ్ డైరెక్టర్ ప్రొఫెసర్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. కాగా.. మరో సెషన్‌లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న కాంగ్రెస్ నేత మణిశంకర్ అయ్యర్ మాట్లాడుతూ కాంగ్రెస్‌ను కాంగ్రెస్ పార్టీలాగానే ఉంచాలని, మరే ఇతర పార్టీల మాదిరిగా మార్చరాదని పేర్కొన్నారు.

రూ. 5 లక్షలిస్తే 'విద్యానిధి' మీదే!

▶ మొదటి పేజీ తరువాయి

మోసం చేస్తూ అందినకాడికి దండుకుంటున్నారు.

అత్యంత గోప్యంగా ఎంపిక ప్రక్రియ

పరిమిత కోటాతో ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోంది. ఎస్సీ, ఎస్టీలకు ఏటా గరిష్టంగా 2 వందల మందికి, బీసీ, ఈబీసీలకు 300 మందికి సాయం అందిస్తోంది. బీసీ, ఈబీసీ కేటగిరీలో ఈ ఏడాది ఏకంగా 3వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. పోటీ తీవ్రంగా ఉండటంతో దరఖాస్తు, సర్టిఫికెట్ల పరిశీలన సమయంలో మధ్యవర్తులు తల్లిదండ్రులను బుట్టలో వేసుకునే ప్రయత్నం చేస్తున్నారు. రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు అడుగుతూ ఈ పథకం కింద తప్పకుండా మీకు ఆర్థిక సాయం అందేలా చూస్తామని నమ్మబలుకుతున్నారు. విద్యానిధి పథకం కింద దరఖాస్తులు, సర్టిఫికెట్ల పరిశీలన, అర్హుల ఎంపికకు స్క్రీనింగ్ కమిటీ ఉంటుంది. సంబంధిత సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి/కార్యదర్శితో పాటు సంక్షేమ శాఖ కమిషనర్/డైరెక్టర్, అదనపు సంచాలకులు, సంయుక్త సంచాలకులు, ఉప సంచాలకులు ఇందులో ఉంటారు. ఈ ప్రక్రియ ఆద్యంతం గోప్యంగా సాగుతుంది. ఎంపికైన తర్వాత జాబితా వెలువడినప్పుడు మాత్రమే అర్హుల పేర్లు బయటకు వస్తాయి. ఈ అంశాన్ని మధ్యవర్తులు అవకాశంగా మలుచుకుంటున్నారు. కొందరు జాబితా వెలువడిన వెంటనే లబ్ధిదారులకు ఫోన్లు చేసి తమ ప్రయత్నం వల్లే ఆర్థిక సాయం అందుతోందంటూ తల్లిదండ్రులకు ఫోన్లు చేసి వసూళ్లకు తెగబడుతున్నారు.

అధికార యంత్రాంగం నజర్

వరంగల్ జిల్లాకు చెందిన విద్యార్థి తండ్రి ఇటీవల ఫిర్యాదు చేయడంతో విద్యానిధి పథకంలో జరుగుతున్న అక్రమ వ్యవహారంపై అధికారులు దృష్టి పెట్టారు. విద్యార్థులు, తల్లిదండ్రులను పిలిపించి మధ్యవర్తుల అంశంపై ఆరా తీస్తున్నారు. సమాచారం ఇచ్చిన వారి నుంచి లిఖిత పూర్వక ఫిర్యాదులు స్వీకరిస్తున్నారు. దీనిపై ప్రత్యేకంగా కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారులు చెబుతున్నారు.

విద్యానిధి అర్హతలు, ఎంపిక ఇలా...

విదేశీ విద్యా నిధి పథకంలో గ్రాడ్యుయేషన్ మార్కులు కీలకం. నిర్దేశించిన దేశాల్లో ఎంఎస్ చదువుకునే విద్యార్థులు ఈ పథకం కింద ఆన్‌లైన్ పద్ధతిలో దరఖాస్తులు సమర్పించాలి. విద్యార్థి డిగ్రీ మార్కులకు 60 శాతం స్కోర్, జీఆర్ఈ/జీమ్యాట్ స్కోర్‌కు 20 శాతం, ఐఈఎల్‌టీఎస్/టోఫెల్‌కు మరో 20 శాతం మార్కులుంటాయి. దరఖాస్తులను అధికారులు వడపోసి నిబంధనల ప్రకారం అత్యధిక మార్కులున్న వారిని రిజర్వేషన్ల వారీగా ఎంపిక చేస్తారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల్లో అత్యధిక మార్కులున్న వారి జాబితాను రూపొందించి పరిమితికి లోబడి అర్హుల ఎంపిక చేపడతారు. బీసీల్లో మాత్రం సబ్ కేటగిరీలు, ఈబీసీ కేటగిరీ వారీగా వడపోత చేపట్టి ఎంపిక చేస్తారు. ఎంపికైన విద్యార్థికి మొదటి రెండు సెమిస్టర్లు పూర్తయ్యాక సగం, చివరి రెండు సెమిస్టర్లు పూర్తయ్యాక మిగతా సాయాన్ని ప్రభుత్వం విద్యార్థి బ్యాంకు ఖాతాలో జమ చేస్తుంది. విద్యార్థి చదువుకు సంబంధించిన ప్రతి అంశాన్ని అధికారులకు ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తేనే నిధులు విడుదలవుతాయి.

బాబు ప్రసంగానికి కుర్చీలే అతిథులు!

- నెల్లూరు, పత్తికొండలో 'రా.. కదలిరా' సభలు అట్టర్ ఫ్లాప్
- లక్ష మంది హాజరవుతారని టీడీపీ నాయకుల అంచనా
- నిండా ఏడెనిమిది వేల మంది కూడా హాజరు కాని పరిస్థితి
- సభ ఆలస్యం.. బాబు మాట్లాడుతుండగానే వెళ్లిపోయిన ప్రజలు

నెల్లూరులో నిర్వహించిన సభలో చంద్రబాబు ప్రసంగిస్తున్న సమయంలోనే జనం లేక ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు



కర్నూలు(సెంట్రల్)/నెల్లూరు, సాక్షి ప్రతినిధి/నెల్లూరు సిటీ : నెల్లూరు నగరంలో, కర్నూలు జిల్లా పత్తికొండలో టీడీపీ ఆదివారం నిర్వహించిన 'రా.. కదలి రా' సభలు జనం లేక వెలవెలబోయాయి. ఆ పార్టీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు ఖాళీ కుర్చీలను చూస్తూ ప్రసంగించాల్సి వచ్చింది. ఒక్కో సభకు లక్ష మంది చొప్పున రప్పించాలనుకున్న వారి వ్యూహం బెడిసికొట్టింది. కనీసం ఏడెనిమిది వేల మంది చొప్పున కూడా జనం హాజరు కాలేదు. వచ్చిన వారు కూడా బాబు ప్రసంగిస్తుండగానే వెళ్లిపోయారు. దీంతో స్థానిక నేతలపై చంద్రబాబు తీవ్రంగా మండిపడ్డారు. నెల్లూరు, పత్తికొండలో భారీ జన సమీకరణకు ఆ పార్టీ నేతలు యత్నించినా ఫలితం లేకపోయింది. చాలాచోట్ల డబ్బులిస్తామన్నా.. 'మేము రాము బాబో.. మీ సభలకు' అంటూ ప్రజలు ముఖంమీదే తేల్చి చెప్పడంతో స్థానిక టీడీపీ నేతలు చేతులెత్తేశారు. రెండు జిల్లాల్లోనూ సభలు జనం లేక వెలవెలబోవడంతో పార్టీ అధిష్టానంతోపాటు క్యాడర్ నైరాశ్యంలోకి వెళ్లిపోయింది.

డబ్బులు, మద్యం ఎర చూపినా..

నెల్లూరులో డబ్బులు, మద్యం ఎర చూపినా ప్రజలు చంద్రబాబు సభ వైపు రాలేదు. కేవలం రెండు వేల మంది మాత్రం ఎస్వీజీఎస్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సభా ప్రాంగణంలో హడావుడి చేశారు. వారూ వసతుల్లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పెద్ద నాయకులకు టెంట్, కూలింగ్ ఫ్యాన్లు ఏర్పాటు చేసిన నిర్వాహకులు కార్యకర్తలను పట్టించుకోకపోవడంతో మండుటెండలో వారు విలవిలలాడారు. ఉదయం 11.30 గంటలకు రావాల్సిన చంద్రబాబు మధ్యాహ్నం 12.45 గంటలకు ఆలస్యంగా సభా ప్రాంగణానికి చేరుకోవడం కార్యకర్తల సహనానికి పరీక్ష పెట్టింది. సభకు వచ్చిన కార్యకర్తలకు రూ.250, క్వార్టర్ మద్యం బాటిల్ పంపిణీ చేయడం కనిపించింది. చంద్రబాబు ప్రసంగిస్తున్న సమయంలో ఆద్యంతం కుర్చీలు ఖాళీగా కనిపించడంతో స్థానిక నాయకులపై బాబు ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది.

తాను మాట్లాడే సమయానికి ప్రజలను నిలబెట్టలేకపోయారా అని నెల్లూరు నగర రూరల్ ఇన్‌చార్జిపై మండిపడ్డారు. పత్తికొండలోని ఆదోని రోడ్డులో జరిగిన సభకు కచ్చితంగా లక్ష మంది వస్తారని శనివారం సాయంత్రం స్థానిక నేతలు చంద్రబాబుకు సమాచారం ఇచ్చారు. తీరా ఆదివారం ప్రజలెవరూ రాకపోవడంతో సభాస్థలిలో ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. కాగా, పత్తికొండ, నెల్లూరులో సభల్లో చంద్రబాబు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. 'ఆయన అభిమన్యుడు కాదు.. అర్జునుడూ కాదూ.. భస్మాసురుడు' అని విమర్శించారు.

పేదరికంపై గెలుపు

- ఏపీలో మెరుగుపడ్డ జీవన ప్రమాణాలు
- పేదల ఆదాయాలు పెరగటంతో పాటు నాణ్యమైన విద్య, వైద్యం
- పౌష్టికాహారం, గృహవసతి, తాగునీరు... అన్నింటా మెరుగుదల
- జీవన నాణ్యత పెరిగి.. పేదరికం తగ్గిందని తేల్చిన నీతి ఆయోగ్
- 2019–21లో 6.06 శాతం... 2022–23 నాటికి 4.19 శాతానికి
- రాష్ట్రంలో నాలుగేళ్ల కాలంలో 1.87 శాతం తగ్గిన పేదరికం
- ఇదే కాలంలో దేశ సగటు 14.96 శాతం నుంచి 11.28 శాతానికి తగ్గుదల
- నవరత్నాలతో వేగంగా సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధన
- డీబీటీ, నాన్ డీబీటీతో ఇప్పటి వరకు రూ.4.21 లక్షల కోట్లు పేదలకు
- భారత దేశంలో, రాష్ట్రంలో పేదరికంపై నీతి ఆయోగ్ నివేదికలో వెల్లడి

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

పాపం తెలుగు దేశం పార్టీ

- గెలుపునకు కనీసం దరిదాపుల్లో కూడా బాబు లేడు
- ఏపీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



నెల్లూరు(సెంట్రల్): నెల్లూరులో నిర్వహించిన 'రా కదలిరా' చంద్రబాబు సభ అట్టర్‌ఫ్లాప్ అయిందని, జనాలు లేక ఖాళీ కుర్చీలకు బాబు ప్రసంగం చేయాల్సిన పరిస్థితి దాపురించిందని ఏపీ వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. నెల్లూరులోని తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం మంత్రి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2019 ఎన్నికల సమయంలో వైఎస్సార్‌సీపీ సమర శంఖారావం సభ ఈ ప్రాంతంలోనే నిర్వహించామని, అప్పుడు వేల మంది జనాలు వచ్చారని గుర్తు చేశారు. కానీ 'రా కదలిరా' అంటూ చంద్రబాబు పిలుపునిచ్చినా కుర్చీలు కూడా నిండలేదన్నారు. 4 వేల కుర్చీల కన్నా తక్కువ వేసి, కనీసం 3 వేల మందిని కూడా తీసుకురాలేని పరిస్థితిలో తెలుగుదేశం నాయకులు ఉన్నారని పేర్కొన్నారు. చంద్రబాబుకు డబ్బాలు కొట్టే సొంత మీడియా కూడా ముందు ఉన్న వంద మందిని తప్ప సభను చూపించలేకపోయిందంటే పరిస్థితి ఏంటో అర్థమవుతోందన్నారు. 2019 ఎన్నికల్లో ఉమ్మడి నెల్లూరు జిల్లాలో పదికి పది అసెంబ్లీ, రెండు ఎంపీ స్థానాలు ఏ విధంగా గెలిచామో.. 2024 ఎన్నికల్లో కూడా అదే సీన్ రిపీట్ అవుతుందని జోస్యం చెప్పారు. జిల్లాలో టీడీపీ గెలుపునకు దరిదాపుల్లో కూడా లేదన్నారు. చంద్రబాబు ప్రసంగం మొత్తం ఊకదంపుడు తప్ప, ఆయన హయాంలో ఏం చేశారో కనీసం చెప్పుకోలేని పరిస్థితి ఏర్పడిందని చెప్పారు.

బైక్‌ను ఢీ కొట్టిన ఆర్టీసీ బస్సు

- ఇద్దరు యువకులు మృతి
- తిమ్మాజిపేట మండలం మరికల్‌లో ఘటన



ప్రమాదానికి కారణమైన బస్సు



చంద్రశేఖర్, హర్షవర్ధన్ మృతదేహాలు

బిజినేపల్లి: ఆర్టీసీ బస్సు బైక్ ఢీకొని ఇద్దరు యువకులు మృతి చెందిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండలం మరికల్ గ్రామ శివారులో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్‌ఐ భాస్కర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... జడ్చర్ల మండలం చర్లపల్లి గ్రామానికి చెందిన వల్లభదాసు చంద్రశేఖర్ (23), హర్షవర్ధన్ (20) బైక్‌పై నాగర్‌కర్నూల్‌కు వెళ్లి.. రాత్రి 9 గంటల తర్వాత సొంత గ్రామానికి బయల్దేరారు. కాగా కొల్లాపూర్ డిపోకు చెందిన ఏపీ 29 జడ్ 0737 నంబర్ గల ఆర్టీసీ బస్సు హైదరాబాద్ నుంచి కొల్లాపూర్ వైపు వస్తుండగా.. మరికల్ గ్రామ శివారు వద్ద బస్సు బైక్ ఎదురెదురుగా ఢీకొట్టింది. ప్రమాదంలో చంద్రశేఖర్, హర్షవర్ధన్‌కు తీవ్రగాయాలు కాగా, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మహిళ మృతి

గద్వాల క్రైం: చికిత్స పొందుతూ మహిళ మృతి చెందిన ఘటన పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. పట్టణ ఎస్‌ఐ శ్రీకాంత్ వివరాల ప్రకారం.. ఈ నెల 26వ తేదీన సరోజ (50)ఆరోగ్య సమస్యలతో చికిత్స కోసం జిల్లా ప్రభుత్వాసుపత్రికి వచ్చింది. ఆదివారం మధ్యాహ్నం పరిస్థితి విషమించి ఆమె మృతి చెందింది. ఆమెకు బంధువులు, కుటుంబ సభ్యులు లేక పోవడంతో మృతదేహాన్ని మార్చ్యూరీలో భద్ర పరిచారు. ఆమెకు సంబంధించిన వారు ఎవరైనా ఉంటే పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్‌ఐ తెలిపారు.

గురువులు లేకుండా శిక్షణ ఎలా?

- రూ.7.79కోట్లతో మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం నిర్మాణం
- ఉమ్మడి జిల్లాలోనే అధునాతమైన వసతులు
- బ్యాడ్మింటన్ కోచ్‌లు లేక క్రీడాకారుల ఇక్కట్లు



జిల్లా కేంద్రంలోని మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలో ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేయాలనే క్రీడాకారుల కల నెరవేరింది. గతంలో ఇక్కడ ఇండోర్ స్టేడియం లేకపోవడంతో ఇతర క్రీడల్లో ప్రతిభ చాటుతున్న క్రీడాకారులు ఇండోర్ గేమ్‌లపై వెనుకబడిపోయారు. ఇండోర్ గేమ్‌లపై ఆసక్తి ఉన్న కొంతమంది క్రీడాకారులు హైదరాబాద్‌లో శిక్షణ తీసుకుంటూ రాణిస్తున్నారు.

రూ.7.79 కోట్లతో మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం

మెయిన్ స్టేడియంలో రూ.7కోట్ల79లక్షల నిధులతో అధునాతనమైన క్రీడా సౌకర్యాలతో మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేశారు. ఉమ్మడి జిల్లాలోనే తలమానికంగా పాలమూరులో మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం నిర్మించారు. ఈ స్టేడియంలో రెండు ఫ్లోర్‌లలో టేబుల్ టెన్నిస్ హాల్, బాక్సింగ్ హాల్‌తోపాటు స్టోర్ రూంలు, క్రీడాకారుల వసతి గదులను ఏర్పాటు చేశారు. ఇండోర్ స్టేడియంలో లోపల క్రీడాపోటీలను తిలకించడానికి రెండు వైపుల గ్యాలరీలు ఏర్పాటు చేసి సీట్లు అమర్చారు. స్టేడియం లోపల ఉడెన్ కోర్టులో ఆరు షటిల్ బ్యాడ్మింటన్ కోర్టులను ఏర్పాటు చేశారు. స్టేడియం బయట గోడలపై ప్రముఖ క్రీడాకారుల చిత్రాలతో తీర్చిదిద్దారు. ఇటీవలే మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంలో మొదటిసారిగా ఫాస్ట్–5 జాతీయస్థాయి సీనియర్ నేషనల్ నెట్ బాల్ పోటీలను నాలుగు రోజులపాటు విజయవంతంగా నిర్వహించారు.

కోచ్‌ల నియామకమయ్యేనా?

మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంలో ముఖ్యంగా షటిల్ బ్యాడ్మింటన్ కోచ్‌లు ఏర్పాటు చేయాలని పలువురు సీనియర్ క్రీడాకారులు కోరుతున్నారు. ఎంతో అధునాతనమైన ఇండోర్ స్టేడియంలో ఒకేసారి ఆరు కోర్టుల్లో క్రీడాకారులతోపాటు బ్యాడ్మింటన్‌లో ఓనమాలు నేర్చుకునే చిన్నారుల శిక్షణ కోసం కోచ్‌ల అవసరం ఎంతగానో ఉంది. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి ఇండోర్ స్టేడియంలో కోచ్‌లను నియమించాలని సీనియర్ క్రీడాకారులు కోరుతున్నారు.

స్పోర్ట్స్ అథారిటీకి ప్రతిపాదనలు పంపాం



మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంలో బ్యాడ్మింటన్ కోచ్‌ల నియామకం కోసం ఇటీవలే స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణకు ప్రతిపాదనలు పంపాం. త్వరలో కోచ్‌లు నియామకం అయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. కోచ్‌లు వస్తే క్రీడాకారులకు మెరుగైన బ్యాడ్మింటన్ శిక్షణ అందుబాటులోకి వస్తుంది. – ఎస్.శ్రీనివాస్, డీవైఎస్‌ఓ

ఫైనల్‌కు చేరిన బళ్లారి, మన్నెవారిపల్లి జట్లు



తలపడుతున్న బళ్లారి, గ్రీన్‌సిటీ జట్లు

అచ్చంపేట రూరల్: పట్టణంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో సీవీకే ఆలిండియా లెవల్ టీ–20 క్రికెట్ టోర్నీ తుది ఘట్టానికి చేరింది. ఆదివారం జరిగిన మొదటి సెమీఫైనల్‌లో గ్రీన్ సిటీ ఎలెవన్ జట్టుపై మ్యాక్స్ క్రికెట్ క్లబ్ బళ్లారి జట్టు 108 పరుగుల భారీ తేడాతో గెలుపొందింది. ఉదయం సెషన్‌లో గ్రూప్–ఏ నుంచి గ్రీన్‌సిటీ వర్సెస్ బళ్లారి జట్లు తలపడగా, టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన బళ్లారి.. నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 222 పరుగులు చేసింది. 223 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన గ్రీన్‌సిటీ 12.3 ఓవర్లలో 114 పరుగులకే ఆలౌటయ్యింది. మధ్యాహ్నం సెషన్ గ్రూప్–బీ నుంచి మన్నెవారిపల్లి సీసీ వర్సెస్, జీటీఆర్ జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న మన్నెవారిపల్లి సీసీ.. నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 190 పరుగులు చేసింది. 191 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన జీటీఆర్.. 19.1 ఓవర్లలో 126 పరుగులకు ఆలౌటయ్యింది.

నేడు ఫైనల్..

సెమీ ఫైనల్‌లో గ్రూప్–ఏ నుంచి బళ్లారి, గ్రూప్–బీ నుంచి మన్నెవారిపల్లి సీసీ జట్లు విజయం సాధించి ఫైనల్‌కు చేరాయి. ఉదయం 11గంటలకు ఫైనల్ మ్యాచ్‌ను ప్రారంభించనున్నట్లు నిర్వాహకులు కపిలవాయి చంద్రమోహన్, కటకం రఘురాం తెలిపారు.

ప్రత్యేకాధికారులకే పంచాయతీల బాధ్యత



మహబూబ్‌నగర్ రూరల్ మండలంలోని ధర్మాపూర్ పంచాయతీ కార్యాలయం

- నేడు ఉత్తర్వులు వచ్చే అవకాశం?
- ఫిబ్రవరి 1తో ముగియనున్న పాలకవర్గాల పదవీకాలం

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): పంచాయతీల బాధ్యతలు ప్రత్యేకాధికారులకు అప్పగించే అవకాశాలు కనిపిస్తున్నాయి. కసరత్తు చేయాలని ఇప్పటికే ప్రభుత్వం కలెక్టర్లకు ఆదేశాలు ఇవ్వడంతో జిల్లా పంచాయతీ అధికారులు అందులో నిమగ్నమయ్యారు. పంచాయతీ పాలకవర్గాల పదవీకాలం ఫిబ్రవరి1వ తేదీతో ముగుస్తుంది. గడువు దగ్గర పడుతున్న కొద్ది సర్పంచ్‌లను కొనసాగిస్తారా.. లేకుంటే ప్రత్యేకాధికారులకు అప్పగిస్తారా అనేది వేచి చూడాలి. ప్రభుత్వం మాత్రం ప్రత్యేకాధికారులకు బాధ్యతలు అప్పగించే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తుంది.

ప్రత్యేకాధికారుల గుర్తింపు

మహబూబ్‌నగర్ జిల్లాలో 441, నాగర్‌కర్నూల్‌లో 461, నారాయణపేటలో 278, జోగుళాంబ గద్వాలలో 255, వనపర్తిలో 255... మొత్తం 1690 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఈ పంచాయతీలకు తహసీల్దార్, ఎంపీడీఓలు, ఎంపీఓలు, పీఆర్ ఏఈలు, మిషన్ భగీరథ ఏఈలు, ఐసీడీఎస్ శాఖలో పని చేసే సూపర్‌వైజర్లు, ఎంఈఓలు, వ్యవసాయ అధికారులు, పశువైద్యాధికారులు, ఆరోగ్య శాఖ అధికారులు, డీటీలు, ఆర్ఐలు, మండల పరిషత్ సూపరింటెండెంట్లు, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు, టైపిస్టులు, గెజిటెడ్ హెచ్‌ఎంలు, స్కూల్ అసిస్టెంట్లను స్పెషల్ ఆఫీసర్లుగా నియమించనున్నట్లు అధికార వర్గాల ద్వారా తెలుస్తుంది.

■ పంచాయతీలకు స్పెషల్ ఆఫీసర్లను నియామకానికి ఉత్తర్వులు సోమవారం వచ్చే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. పంచాయతీ ఎన్నికలకు 2019 జనవరి 1వ నోటిఫికేషన్ జారీ అయింది. 21, 25, 30 తేదీల్లో మూడు విడతలుగా ఎన్నికలు నిర్వహించారు.

పద్యనాటక రంగాన్ని కాపాడుకుందాం



పద్యనాటకంలోని ఓ సన్నివేశం



కళాకారుడిని సన్మానిస్తున్న అతిథులు

స్టేషన్ మహబూబ్‌నగర్: పద్యనాటక రంగాన్ని కాపాడుకోవాల్సిన అవసరం మనందరిపై ఉందని రాష్ట్ర సంగీత, నాటక అకాడమి మాజీ చైర్మన్ బాద్మి శివకుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని మున్సిపల్ టౌన్‌హాల్ శ్రీమిత్ర కళానాట్యమండలి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పద్యనాటక ప్రదర్శనలు ఆదివారం ఘనంగా ముగిశాయి. కార్యక్రమంలో పాల్గొన్న బాద్మి శివకుమార్ మాట్లాడుతూ.. నాటక కళారంగం పూర్వవైభవానికి కృషి చేద్దామని పిలుపునిచ్చారు. డీపీఆర్ఓ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తెలుగు నాటక రంగాన్ని అభివృద్ధి చేసుకుందామని అన్నారు. పద్య నాటక రంగాన్ని ముందుకు తీసుకెళదామని, పిల్లలు పద్యనాటకాలు నేర్చుకునేలా ప్రోత్సహించాలని కోరారు. అనంతరం రంగస్థల కళాకారులు వెంకటస్వామి, రాంచంద్రయ్యలను ఘనంగా సన్మానం చేశారు. చివరి రోజు వివిధ నాటక అంకాలతోపాటు మాయసభ దుర్యోధన, రావాణబ్రహ్మ ఏకాపాత్రాభినయం ప్రదర్శనలు నిర్వహించారు. కార్యక్రమంలో సెంట్రల్ ఫిలిం సెన్సార్‌బోర్డు మెంబర్ టీవీ రంగయ్య, నారాయణ, బాలయ్య, వైద్యం భాస్కర్, నర్సింహులు, ప్రభాకరాచారి, మాధవరాజు, దత్తు, రాజు, బాల్‌రెడ్డి, పురుషోత్తం, వెంకటయ్య, కురుమూర్తి, ఆంజనేయులు, చెన్నయ్య, కాశన్న, దామోదర్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.